GSTIN-NO:36FKPSI308PIZX

epaper:tmedia.net.in

# టి-మీడియా

సామాజికం... ప్రజల పక్షం

మెయిన్ : శుక్రవారం- జనవరి 26-2024 పేజీలు : 3

## టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌గా
# మాజీ డీజీపీ మహేందర్ రెడ్డి



**టి మీడియా జనవరి 25,హైదరాబాద్ :** తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్సీ) చైర్మన్‌గా మాజీ డీజీపీ మహేందర్ రెడ్డి నియామకం అయ్యారు. మహేందర్ రెడ్డి నియామకానికి గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్ ఆమోదం తెలిపారు. కొద్ది రోజుల క్రితం వరకు ఐఏఎస్ అధికారి జనార్ధన్ రెడ్డి టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌గా కొనసాగిన సంగతి తెలిసిందే. ఆయన హయాంలో టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాలు లీక్ కావడంతో పలు పరీక్షలు వాయిదా పడ్డాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే టీఎస్‌పీఎస్సీ ప్రక్షాళన దిశగా అడుగులు వేసింది. చైర్మన్‌తో పాటు సభ్యులందరూ రాజీనామా చేశారు. తాజాగా కొత్త చైర్మన్‌ను నియమించింది కాంగ్రెస్ ప్రభుత్వం. సభ్యుల నియామకం కూడా తర్వలోనే పూర్తి చేసే అవకాశం ఉంది.1962 డిసెంబర్ 3న జన్మించిన మహేందర్‌రెడ్డి 1986 బ్యాచ్ ఐపీఎస్ అధికారి. మహేందర్ రెడ్డి ఐపీఎస్‌గా 36 ఏండ్ల పాటు సుదీర్ఘ సేవలందించారు. పోలీసు శాఖలో సాంకేతికతతో విప్లవాత్మక మార్పులు తెచ్చారు మహేందర్ రెడ్డి. 2022, డిసెంబర్ 31వ తేదీన మహేందర్ రెడ్డి పదవీ విరమణ చేశారు

## కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టేలా...
# వారిద్దరి కుయుక్తులు

- హామీలను కచ్చితంగా అమల్లోకి తేస్తాం
- ప్రజల మధ్య ఉంటే గెలుస్తాం
- ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే

**టి మీడియా జనవరి 25,హైదరాబాద్:** రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇచ్చిన అన్ని హామీలపై ప్రశ్నిస్తామని ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే వ్యాఖ్యానించారు.ఎల్బీ స్టేడియంలో నేడు జరిగిన తెలంగాణ కాంగ్రెస్ పార్టీ బూత్ లెవెల్ లీడర్స్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో మోదీ గ్యారంటీ అని పత్రికలలో ప్రకటనలు ఇచ్చారు.. మరి రెండు కోట్ల ఉద్యోగాల గ్యారంటీ ఏమైంది... నల్లధనం వెనక్కు తెప్పిస్తాం అన్నాడు ఏమైందని ప్రశ్నించారు. దేశంలో ఏ ఒక్కరికీ పనులు లేకుండా మోదీ చేశారని ధ్వజమెత్తారు. పని లేకపోతే ప్రజలకు ఉపాధి ఎలా..? వారి కడుపు ఎలా నిండుతది అని ప్రశ్నించారు. మోదీ ప్రజాస్వామ్యాన్ని బలపరుస్తున్నాం అంటూ బలహీన పరుస్తున్నాడని మల్లికార్జున్ ఖర్గే ధ్వజమెత్తారు.

### వారిని అయోధ్యకు ఎందుకు రానివ్వలేదు

పార్లమెంట్‌లో సమస్యలపై మాట్లాడితే ఎంపీలను సస్పెండ్ చేస్తారని మండిపడ్డారు. గురువారం నాడు ఎల్బీ స్టేడియంలో టీపీసీసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖర్గే మాట్లాడుతూ... మొన్న పార్లమెంట్‌లో 146 ఎంపీలను సస్పెండ్ చేశారన్నారు. మోదీ పదేళ్లుగా అన్ని సంస్థలను నాశనం చేశారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మోదీ కుట్రలను బహిర్గతం చేయాలన్నారు. మొన్న మోదీ అయోధ్యలో ఒక్కరే గర్భ గుడిలో పూజలు చేశారని.. అద్వానీ, మనోహర్ జోషిలను ఎందుకు లోపలికి రానివ్వలేదని ప్రశ్నించారు. దేశంలో దేవుడు ప్రతి ఇంట్లో ఉన్నాడు.. కానీ దేవుడు తమ దగ్గరే ఉన్నట్టు మోదీ ప్రచారం చేసుకుంటున్నాడని దుయ్యబట్టారు. ఆకలి అయినవాడికి అన్నం పెట్టాలని.. ఉపాధి లేని వారికి ఉద్యోగం ఇవ్వాలని.. కానీ మోదీ ఎన్నికల రాజకీయాలు, ప్రచారంతోనే కాలం గడుపుతున్నారని మండిపడ్డారు. ప్రజల సొమ్ముతో మోదీ ప్రచారం చేసుకుంటున్నాడని మల్లికార్జున్ ఖర్గే ధ్వజమెత్తారు.

### హామీలను కచ్చితంగా అమల్లోకి తేస్తాం

రెండు నెలల్లో పార్లమెంట్ ఎన్నికలు ఉన్నాయని.. బూత్ ఏజెంట్లు అత్యంత కీలకంగా పనిచేయాలని సలహాలు ఇచ్చారు. వారు చేసిన కృషి ఫలితంగా రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నేతృత్వంలో అధికారంలోకి వచ్చామని చెప్పారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలను ఇచ్చామని.. అప్పుడే రెండు గ్యారంటీలు అమలు చేశామని తెలిపారు. కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీల ప్రకారం అన్ని అమలు చేస్తామని స్పష్టం చేశారు. దేశంలో యువత ఉందని.. వారికి ఉపాధి లేదన్నారు. రాహుల్ మణిపూర్ నుంచి భారత్ న్యాయ యాత్ర ప్రారంభించారని.. దిగ్విజయంగా సాగిస్తున్నారని తెలిపారు. ప్రజలంతా బాగుండాలని రాహుల్ యాత్ర చేస్తున్నారన్నారు. రాహుల్ గాంధీ యువత, మహిళ, దళిత, గిరిజన ప్రజల కోసం కష్ట పడుతున్నారని వివరించారు. మొన్నటి ఎన్నికల్లో కాంగ్రెస్ క్యాడర్ కష్టపడి, రాహుల్ గాంధీ కృషి వల్ల రాష్ట్రంలో అధికారంలోకి వచ్చినట్లు తెలిపారు. ఇక్కడ మీరంతా కష్టపడి ఎలాంటి ఫలితాలు తెచ్చారో దేశంలో కూడా అలాంటి ఫలితాలను తేవాలని ఆకాక్షించారు. ఇక్కడ ప్రభుత్వ పనితీరు, రేవంత్ రెడ్డి పనితీరు ఆదర్శంగా ఉందని అభినందించారు. ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాలు ఎక్కడ బలహీనంగా ఉంటే అక్కడ ప్రభుత్వాలు పడగొట్టేందుకు కుయుక్తులు పన్నుతారని మల్లికార్జున్ ఖర్గే హెచ్చరించారు.రేవంత్ జాగ్రత్త..తెలంగాణలో గతంలో ఉన్న కాంగ్రెస్ ఇప్పుడు లేదని.. చాలా పటిష్టమైన కాంగ్రెస్ రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఉందని జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మోదీ, షాలు ఈడీ, సీబీఐ, ఐటీలను ఉపయోగించి దాడులు చేసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. సీఎం రేవంత్ రెడ్డితో పాటు కాంగ్రెస్ నాయకులంతా చాలా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. బీజేపీ భయపెట్టే ప్రయత్నం చేస్తోందని.. కానీ బీజేపీకి తెలంగాణలో ఎవరు భయపడరని చెప్పారు. కేసీఆర్ బీజేపీపై ఎప్పుడు ఆరోపణలు చేయలేదని.. ఆయన బీజేపీకే మద్దతిస్తారని.. బీజేపీ, బీఆర్ఎస్‌లను కాంగ్రెస్ రాష్ట్రంలో ఓడించిందని.. లోక్‌సభ ఎన్నికల్లో వారిని ఓడిస్తామని తేల్చిచెప్పారు. ఇక్కడ కాంగ్రెస్ ఎంత బలంగా ఉందో అర్థం చేసుకోవచ్చని అన్నారు. క్యాడర్ లోక్‌సభ ఎన్నికల్లో కష్టపడి పనిచేస్తే విజయం సాధిస్తామని చెప్పారు. నెహ్రూ ఒకసారి ఇలా అన్నారని "మనం ప్రజల మధ్య ఉంటే గెలుస్తాం... లేకపోతే ఓడిపోతాం" అని చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. క్యాడర్ గ్రామ, బూత్ స్థాయిలో పని చేయాలని సూచించారు. మీ శక్తి అంత గ్రామ, బూత్ స్థాయిలో పని చేసి రాబోయే పార్లమెంట్, తదితర ఎన్నికల్లో శక్తి వంచన లేకుండా పని చేసి విజయం సాధించాలని మల్లికార్జున్ ఖర్గే పిలుపునిచ్చారు.





## కుటుంబంలో చీలిక పాపం
# జగన్ దే

### -ఏపీ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల

**టి మీడియా జనవరి 25,అమరావతి :**అభివృద్ధి లేకుండా రాష్ట్రం దయనీయ స్థితిలో ఉందంటే దానికి కారణం సీఎం జగనేనని ఏపీ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల మండిపడ్డారు. జిల్లాల పర్యటనలో భాగంగా కాకినాడలో పార్టీ నేతలు, కార్యకర్తలతో నేడు ఆమె సమావేశమయ్యారు. రాష్ట్రాన్ని, తన కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ చీల్చిందంటూ జగన్ చేసిన వ్యాఖ్యలపై ఆమె ఈ సమావేశంలో స్పందించారు.కాంగ్రెస్ పార్టీ.. రాష్ట్రాన్ని, తన కుటుంబాన్ని చీల్చింది అని పెద్ద పెద్ద మాటలు మాట్లాడారు జగన్ అన్న. దేవుడే గుణపాఠం చెప్తారట. నిజానికి ఆంధ్ర రాష్ట్రం ఇలా అభివృద్ధి లేకుండా దయనీయ స్థితిలో ఉంది అంటే కారణం జగన్ అన్నే. ఇవాళ వైఎస్సార్ కుటుంబం చీలింది అంటే అది చేతులారా చేసుకున్నది జగన్ అన్నే. దీనికి సాక్ష్యం దేవుడు దీనికి సాక్ష్యం నా తల్లి, వైఎస్సార్ భార్య విజయమ్మ. దీనికి సాక్ష్యం నా యావత్ కుటుంబం.జగన్ మోహన్ రెడ్డి పార్టీ ఇబ్బందిలో ఉంటే.. 18 మంది రాజీనామాలు చేసి జగన్ అన్న వైపు నిలబడితే. అధికారంలో వచ్చాకా మంత్రులను చేస్తా అన్నారు. ఇవాళ వాళ్ళలో ఎంత మంది మంత్రులుగా ఉన్నారు? వాళ్ళు రాజీనామాలు చేస్తే అమ్మ, నేను వాళ్ళ కోసం తిరిగాం. వాళ్ళ గెలుపు కోసం పాటు పడ్డాం. వాళ్ళను గెలిపించాం. వైసీపీ కష్టాల్లో ఉందని నన్ను పాదయాత్ర చేయమన్నారు. నా ఇంటిని, పిల్లలకు పక్కన పెట్టి ఎండనక, వాననక రోడ్ల మీదనే ఉన్న. ఆ తర్వాత సమైక్య యాత్ర కోసం అడిగితే ప్రజల బాగు కోసమే కాదా అని ఆ యాత్ర కూడా చేశా.తెలంగాణలో కూడా ఓదార్పు యాత్ర చేశా. ఎప్పుడు అడిగితే అప్పుడు మాట కూడా మాట్లాడకుండా అండగా నిలబడ్డా. ఎందుకు అని అడగకుండా, స్వలాభం చూడకుండా, నిస్వార్థంగా ఏది అడిగితే అది చేశా. గత ఎన్నికల్లో బై బై బాబు అంటూ ఊరూరా తిరిగా. దేశంలోనే మోస్ట్ సక్సెస్ ఫుల్ క్యాంపెయిన్ చేశా. మిమ్మల్ని గెలిపించా. జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు అంటూ చెప్పుకొచ్చారు..గెలిచిన తర్వాత జగన్ మోహన్ రెడ్డి వేరే మనిషిగా మారిపోయారు. నాకు వ్యక్తిగతంగా అన్యాయం చేసినా కూడా పర్వాలేదు అనుకున్నాను. మంచి ముఖ్యమంత్రి అయితే చాలు.. వైఎస్సార్ పేరు, ఆశయాలను నిలబెడితే చాలు అనుకున్న. ఈ ఐదేళ్లలో ముఖ్యమంత్రితో సహా అందరూ బీజేపీకి బానిసలుగా మారారు. బీజేపీకి ఒక్క ఎమ్మెల్యే లేడు, ఎంపీ లేడు. అయినా ఏపీలో బీజేపీ రాజ్యం ఏలుతుంది. జగన్ ఆయన పార్టీని, రాష్ట్రాన్ని బీజేపీ దగ్గర తాకట్టు పెట్టాడు. ప్రత్యేక హోదా అడగకుండా బానిస అయ్యారు. 5 ఏళ్లలో ఒక్క రోజు కూడా హోదా అడగలేదు. రాష్ట్రంలో ఇప్పుడు హోదా అన్న అంశమే లేదు" అంటూ షర్మిల తనదైన శైలిలో అన్న జగన్ రెడ్డిపై విరుచుకుపడ్డారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కలల ప్రాజెక్టు పోలవరమని షర్మిల తెలిపారు. వైఎస్ సీఎం అయిన 6 నెలల్లోనే శంకుస్థాపన చేశారని దానిని ఇంత వరకు ఎందుకు పూర్తి చేయలేదని జగన్ ను ఆమె సూటిగా ప్రశ్నించారు.




## నేడుకేసీఆర్ అధ్యక్షతన బిఆర్ఎస్ పార్టీ పార్లమెంటరీ సమావేశం

**టి మీడియా జనవరి 25,ఎర్రవెల్లి :**లోని ఫామ్ హౌస్‌లో జరిగే ఈ సమావేశానికి కేసీఆర్ అధ్యక్షత వహించనున్నారు. శుక్రవారం మధ్యాహ్నం నిర్వహించే సమావేశానికి రాజ్యసభ, లోక్ సభ సభ్యులు హాజరు కావాలని ఇప్పటికే సమాచారమిచ్చారు. ఈ కీలక సమావేశానికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు సైతం హాజరు కానున్నారు. :ఈనెల 31వ తేదీ నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు జరగనున్న నేపథ్యంలో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించే అవకాశం ఉంది. బీఆర్ఎస్ పార్లమెంట్లో అనుసరించాల్సిన విధానాలను కేసీఆర్ ఎంపీలకు దిశా నిర్దేశం చేయనున్నారు. అదేవిధంగా పలువురు సిట్టింగ్ ఎంపీలకు టికెట్‌పై అధినేత క్లారిటీ ఇవ్వలేదు. కేవలం బోయినపల్లి వినోద్ కుమార్, రంజిత్ రెడ్డి, నామా నాగేశ్వరరావు మాత్రమే ఎంపీ టికెట్‌పై హామీ ఇచ్చారు. మిగతా సిట్టింగ్లకు పార్లమెంటరీ సన్నాక సమావేశాల్లో ఎలాంటి క్లారిటీ ఇవ్వలేదు. ఈ సమావేశంలో క్లారిటీ ఇస్తారని కొంతమంది ఆశిస్తున్నారు.

## టి మీడియా కదనం కు సవరణ

టి మీడియా దీన పత్రిక మెయిన్ పేజీ లో 2023 డిసెంబర్ 16న "సీడ్ పేరుతో బడా ఫ్రాడ్" వచ్చిన కదనం లో "అగ్రి ప్రైమ్ సీడ్స్ ప్రవైట్ లిమిటెడ్ "కంపెనీ నుండి జరిగే ఉత్పత్తి లో "భీష్మ " వరి వగడం గురించి తప్పుగా వచ్చింది. కేంద్ర ప్రభుత్వ డిజిటల్ మీడియా గైడ్ లైన్స్ కీ అనుగుణంగా ఏర్పాటు అయిన టి మీడియా స్వీయ నియంత్రణ కమిటీ కీ ఫోన్ ద్వారా పిర్యాదు అందింది. కమిటీ పిర్యాదు పై విచారణ జరుప గా టి మీడియా లో వచ్చిన బీష్మ వరి వంగడం ఫోటో అగ్రి ప్రైమ్ షెడ్స్ ప్రవైట్ లిమిటెడ్ మెహినా బాద్, సిద్దిపేట జిల్లావారిది అని. వీరిది ఓరిజినల్ వంగడం అని, అదే పేరుతో నకిలీ వి ఉన్న ట్లు గా వెల్లడి అయింది. ఈ మేరకు కమిటీ ఆదేశాలు మేరకు సవరణ ప్రచురించడం జరుగు తొంది. డిసెంబర్ 16 టి మీడియా మెయిన్ పేవర్ అన్లైన్ నుండీ తొలగించడం జరిగింది. ఆ పత్రిక కదనం ఎవరైనా స్ట్రోల్ చేస్తే చట్ట పరమైన చర్యలు ఉంటాయి అని తెలియ చేస్తున్నాము.




ఓరిజినల్ వంగడం

ఇట్లు : యాజమాన్యం



## ఖర్గేకు రేవంత్ రెడ్డి ఘన స్వాగతం

**టి మీడియా జనవరి 25,హైదరాబాద్ :** ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హైదరాబాద్ వచ్చారు. నగరంలోని ఎల్బీ స్టేడియంలో సాయంత్రం కాంగ్రెస్ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్ల సమావేశం ఉంది. ఈ సమావేశంలో పాల్గొనేందుకు ఖర్గే హైదరాబాద్ వచ్చారు. ఢిల్లీ నుంచి బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్న ఖర్గేకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తదితరులు ఘన స్వాగతం పలికారు. త్వరలో లోక్ సభ ఎన్నికలు ఉన్న నేపథ్యంలో పార్టీ కేడర్‌కు ఖర్గే దిశా నిర్దేశనం చేయనున్నారు. ఈ సమావేశంలో ఖర్గేతో పాటు సీఎం రేవంత్ రెడ్డి, తెలంగాణ కాంగ్రెస్ ఇంఛార్జ్ దీపా దాస్ మున్షీ, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు, నాయకులు పాల్గొననున్నారు.

## ఎమ్మెల్సీలుగా ప్రొఫెసర్ కోదండరాం, అమీర్ అలీ ఖాన్..

### గవర్నర్ ఆమోదం



**టీ మీడియా, జనవరి 25, హైదరాబాద్:** తెలంగాణలో గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా ప్రొఫెసర్ కోదండరాం, అమీర్ అలీ ఖాన్ నియమితులయ్యారు. ఎమ్మెల్సీలుగా కోదండరాం, అమీర్ అలీ ఖాన్ నియామకాలను గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ ఆమోదించారు.వారిద్దరిని గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించడంతో తమిళిసై ఈ నిర్ణయం తీసుకున్నారు. నిన్న తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి రాజ్‌భవన్‌కు వెళ్లి ఎమ్మెల్సీల అంశంపై చర్చించారు.కాగా, టీజేఎస్ పార్టీ అధినేత కోదండరాం 2018 తెలంగాణ ఎన్నికల్లో కాంగ్రెస్ తో పొత్తు పెట్టుకుని పోటీ చేసిన విషయం తెలిసిందే. 2023 ఎన్నికల్లో పోటీ చేయకుండా కాంగ్రెస్ పార్టీకి మద్దతు ప్రకటించారు. తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషనర్ చైర్మన్‌గా మాజీ డీజీపీ మహేందర్ రెడ్డి నియామకాన్ని కూడా గవర్నర్ తమిళిసై ఇవాళ ఆమోదించిన విషయం తెలిసిందే.

### మంత్రివర్గంలోకి కోదండరాం?

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల ఢిల్లీ వెళ్లి ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపిక, నామినేటెడ్ పోస్టుల భర్తీపై చర్చించారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కోదండరాం బేషరతుగా కాంగ్రెస్ పార్టీకి మద్దతిచ్చి ఆ పార్టీ విజయానికి కృషి చేశారు. ఆయనకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వడంతో మంత్రివర్గంలోకి తీసుకోబోతున్నారన్న ప్రచారం జరుగుతోంది. త్వరలోనే మంత్రివర్గ విస్తరణకు అవకాశం ఉంది. మరో ఆరుగురిని కేబినెట్ లో తీసుకునే అవకాశం ఉంది.

## తెలంగాణని పునర్ నిర్మాణం చేస్తున్న
# మేస్త్రీ నేనే



- పులి బయటికి వస్తుంది అన్నారు, బోను తో రెడీగా ఉన్నాము
- వేల కోట్లు దోచుకున్న వారిని రాజ్యసభ సభ్యులను చేశారు
- విపక్షాలకు సీఎం రేవంత్ రెడ్డి మాస్ వార్నింగ్

**టి మీడియా జనవరి 25,హైదరాబాద్:** కాంగ్రెస్ పార్టీ దయ వల్లే నేను ముఖ్యమంత్రిని అయ్యాను అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో మరో రెండు హామీల అమలు కోసం ప్రభుత్వం సిద్ధమైందని చెప్పారాయన. ఫిబ్రవరి చివరి వరకు రైతుభరోసాలో భాగంగా రైతుల ఖాతాల్లో నగదు వేసే బాధ్యత మాది అని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో కాంగ్రెస్ బూత్ స్థాయి కన్వీనర్ల సమావేశంలో రేవంత్ రెడ్డి మాట్లాడారు. గుంపు మేస్త్రీ అంటూ విపక్షాలు చేసిన విమర్శలకు రేవంత్ రెడ్డి ఘాటుగా బదులిచ్చారు. ఎల్బీ స్టేడియం వేదికగా ప్రత్యర్థులకు మాస్ వార్నింగ్ ఇచ్చారు రేవంత్ రెడ్డి.అవును.. నేను మేస్త్రీనే. మీరు విధ్వంసం చేసిన తెలంగాణని పునర్ నిర్మాణం చేస్తున్న మేస్త్రీ నేనే. ఈ నెలలోనే ఇంద్రవెల్లి వస్తాను. కాస్కోండి. కేసీఆర్ ఎవరిని రాజ్యసభ సభ్యులను చేశారు? దోచుకున్న వాళ్ళకి పదవులు ఇచ్చారు. 50వేల రూపాయలు లేకున్నా 52వేల మెజార్టీ సాధించిన సామేలుకు మేం టికెట్ ఇచ్చాం" అని ఎల్బీ స్టేడియంలో కాంగ్రెస్ బూత్ స్థాయి కన్వీనర్ల సమావేశంలో రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.దేశం కోసం గాంధీ కుటుంబం ఎన్నో త్యాగాలు చేసింది. ఎమ్మెల్యేగానో ఎంపీగానో ఎన్నికై 6నెలలు కాకముందే మంత్రి, కేంద్రమంత్రి కావాలని అడిగే ఈరోజుల్లో రాహుల్ గాంధీ ఏనాడూ నన్ను ప్రధాని చేయండని అని ఎప్పుడైనా అడిగారా? స్వతంత్ర పోరాటంలో బీజేపీ పాత్ర ఏంటిదో ప్రస్తుత బీజేపీ నాయకులు చెప్పాలి. తెలంగాణ ఇచ్చిన గాంధీ పార్టీని మనం పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపించాలి.మనకు మోదీతో యుద్ధం. గల్లీలో ఉన్న బిల్లా, రంగాలతో కాదు. జనాలు బీఆర్ఎస్ ను ఊరికే ఓడగొట్టలేదు. జనాలకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదు కాబట్టి బీఆర్ఎస్ ను ఓడించారు. ప్రభుత్వం ఏర్పడ్డ 100 రోజులలోపు మేము ఇచ్చిన హామీలు అమలు చేస్తాము. ఇప్పటికే రెండు గ్యారంటీలు అమలు చేశాము. ఫిబ్రవరిలో మరో రెండు గ్యారంటీలు అమలు చేస్తాము. బీఆర్ఎస్ ఇచ్చిన ఒక్క హామీని కూడా పూర్తిగా అమలు చేయలేదు. ఏ హామీని అమలు చేయని బీఆర్ఎస్ నాయకులకు మమ్మల్ని అడిగే హక్కు లేదు.ఫిబ్రవరి నెలాఖరువరకు రైతుబంధు పూర్తిగా వేస్తాము. రేవంత్ రెడ్డి నిజంగా మేస్త్రీనే. మీరు చేసిన విధ్వంసాన్ని సరి చేసే మేస్త్రీని నేను. మిమ్మల్ని 100 మీటర్ల లోతులో ఘోరీ కట్టే మేస్త్రీని నేనే. ఈ నెలాఖరుకు ఇంద్రవెల్లికి వస్తున్న కాస్కోండి. కేసీఆర్ ఎవరిని రాజ్యసభ సభ్యులు చేశారు? కరోనా కాలంలో వేల కోట్లు దోచుకున్న పార్థసారథిరెడ్డిని, రవిచంద్ర, దామోదరలను రాజ్యసభ సభ్యులను చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ చిన్న చిన్న కార్యకర్తలకు టికెట్లు ఇస్తే ఎమ్మెల్యేలు అయ్యారు. మరి మీరు ఎవరికి టికెట్లు ఇచ్చారు? కాంగ్రెస్ ఒక దళితుడిని ఏఐసీసీ చీఫ్ చేసింది. మరి మీరు ఎవరిని చేశారు? 17 పార్లమెంట్ స్థానాల్లో నేను సభలు పెడతాను. మొన్నటి ఎన్నికల్లో మీ పార్టీని ఓడించాము.ఈ ఎన్నికల్లో మేము గెలిచి బిల్లా రంగాలను తెలంగాణ సరిహద్దులను దాటిస్తాము. బిల్లా, రంగాలు ఎక్కువ తక్కువ మాట్లాడుతున్నారు. చార్లెస్ శోభరాజు ఇంట్లో దుప్పటి పట్టుకుని పడుకున్నారు. పులి బయటికి వస్తుంది అన్నారు కదా రమ్మని చెప్పండి బోను పట్టుకుని రెడీగా ఉన్నాము. మోదీ కేడీ రెండూ ఒక్కటే. నాణేనికి మోదీ ఒకవైపు, కేసీఆర్ ఒకవైపు. ఇక్కడ గెలిచిన ఒకటో రెండో సీట్లు కూడా కేసీఆర్ మోదీకి తాకట్టు పెడతారు. ఇందిరమ్మ కమిటీలు వేస్తాము. అందులో బూత్ లెవల్ కమిటీ సభ్యులు ఉంటారు" అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

## ఆస్ట్రేలియా బీచ్‌లో మునిగి నలుగురు భారతీయుల మృతి

**టి మీడియా జనవరి 25,విక్టోరియా :** ఆస్ట్రేలియాలోని ఓ బీచ్‌లో స్నానాలకు వెళ్లిన నలుగురు భారతీయులు ప్రమాదవశాత్తు నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన విక్టోరియాలోని ఫిలిప్ ఐలాండ్ బీచ్‌లో జరిగినట్టు కాన్‌బెర్రాలోని భారత హైకమిషన్ తెలిపింది.

మిగతా 2 లో



## ఆస్ట్రేలియా బీచ్‌లో మునిగి నలుగురు భారతీయుల మృతి

**టి మీడియా జనవరి 25,విక్టోరియా :** ఆస్ట్రేలియాలోని ఓ బీచ్‌లో స్నానాలకు వెళ్లిన నలుగురు భారతీయులు ప్రమాదవశాత్తు నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన విక్టోరియాలోని ఫిలిప్ ఐలాండ్ బీచ్‌లో జరిగినట్టు కాన్‌బెర్రాలోని భారత హైకమిషన్ తెలిపింది. జనవరి 25న మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో ముగ్గురు మహిళలు, ఓ పురుషుడు బీచ్‌లో ప్రమాదంలో ఉన్నట్టు తమకు సమాచారం అందినట్టు విక్టోరియా పోలీసులు తెలిపారు. వెంటనే అక్కడికి చేరుకుని వారిని రక్షించే ప్రయత్నం చేశామని, అయితే అప్పటికే ఇద్దరు మహిళలు, ఓ పురుషుడు ప్రాణాలు కోల్పోయారని, అపస్మారకస్థితిలో ఉన్న మరో మహిళను ఆసుపత్రికి తరలించినట్టు చెప్పారు. అక్కడామె చికిత్స పొందుతూ మృతి చెందినట్టు తెలిపారు. వీరి మృతి వెనక ఎలాంటి అనుమానాస్పద పరిస్థితులు లేవని, దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు. బాధితుల స్నేహితులను సంప్రదించి అవసరమైన సాయం అందిస్తామని చెబుతూ.. వారి కుటుంబాలకు కాన్‌బెర్రాలోని భారత హైకమిషన్ సానుభూతి తెలిపింది. మృతుల వివరాలు తెలియాల్సి ఉంది.

## రాహుల్‌గాంధీపై కేసు సిఐడికి బదిలీ



**టి మీడియా జనవరి 25,గువహటి :** కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, ఆయన సహచరులపై నమోదైన కేసును సిఐడికి బదిలీ చేసినట్లు అస్సాం పోలీసులు గురువారం తెలిపారు. సమగ్రమైన, లోతైన దర్యాప్తు కోసం ఈ కేసును సిఐడికి బదిలీ చేస్తున్నట్లు అస్సాం పోలీస్ చీఫ్ జిపి.సింగ్ ఎక్స్‌లో తెలిపారు. రాహుల్ గాంధీతో పాటు ఇతర కాంగ్రెస్ నేతలపై అల్లర్లు, చట్టవిరుద్ధమైన సమావేశాలు, నేరపూరిత కుట్రకు సంబంధించి ఐపిసిలోని తొమ్మిది సెక్షన్ల కింద కేసు నమోదైంది. ఈ కేసు రాహుల్‌గాంధీ, అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మల మధ్య తీవ్రమైన మాటలయుద్ధానికి దారితీసింది.రెండు రోజుల క్రితం అస్సాం రాజధాని గువహటికి పట్టణ పరిధిలో రాహుల్ చేపడుతున్న భారత్ జోడో న్యాయ్ యాత్రలో పార్టీ కార్యకర్తలు, పోలీసుల మధ్య ఘర్షణ చెలరేగిన సంగతి తెలిసిందే. ట్రాఫిక్ జామ్ ఏర్పడే అవకాశం ఉందని ఆరోపిస్తూ హిమంత బిస్వాశర్మ ప్రభుత్వం గువహటి రోడ్లపై యాత్రను అనుమతించేందుకు నిరాకరించింది. అనుమతి నిరాకరించడం సరికాదంటూ కాంగ్రెస్ నేతలు నగరంలోకి ప్రవేశించేందుకు యత్నించారు. దీంతో ఇరు వర్గాల మధ్య వాగ్వివాదం నెలకొంది.

## సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా కర్ణాటక చీఫ్ జస్టిస్



**టి మీడియా జనవరి 25,న్యూఢిల్లీ :** కర్ణాటక హైకోర్టు చీఫ్ జస్టిస్ పి.బి. వరాలే సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేశారు. సుప్రీంకోర్టు ప్రాంగణంలో గురువారం జరిగిన కార్యక్రమంలో సిజెఐ డివై. చంద్రచూడ్ జస్టిస్ వరాలేతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి సిజెఐ సహా 34 మంది న్యాయమూర్తుల ఫుల్ బెంచ్ కొలువుతీరింది. జస్టిస్ బి.ఆర్.గవై, జస్టిస్ సిటి.రవికుమార్‌ల తర్వాత జస్టిస్ వరాలే షెడ్యూల్డ్ కమ్యూనిటీకి చెందిన మూడవ సిట్టింగ్ జడ్జి కానున్నారు.సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు మేరకు జస్టిస్ ప్రసన్న బాలచంద్ర వరాలేను సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా బుధవారం కేంద్రం ఆమోదించిన సంగతి తెలిసిందే. జస్టిస్ వరాలే పేరును ఈనెల ప్రారంభంలో కొలీజియం సిఫారసు చేసింది. ఆయన అత్యంత సీనియర్ హైకోర్టు న్యాయమూర్తులలో ఒకరు, షెడ్యూల్డ్ కులానికి చెందిన ఏకైక హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అనే వాస్తవాన్ని పరిగణనలోకి తీసుకున్నట్లు కొలీజియం తెలిపింది.

## 1132 మందికి పోలీసు పతకాలు : కేంద్ర హోంశాఖ



**టి మీడియా జనవరి 25,ఢిల్లీ:** రిపబ్లిక్ డే వేడుకలను పురస్కరించుకుని కేంద్ర హోంశాఖ.. పోలీసు, ఫైర్ సర్వీస్, హోంగార్డ్, సివిల్ డిఫెన్స్ అధికారులకు వివిధ పోలీసు పతకాలను ప్రకటించింది. ఈ మేరకు గురువారం అవార్డుల జాబితాను విడుదల చేసింది. దేశవ్యాప్తంగా 1132 మందికి గ్యాలంట్రీ/సర్వీసు పతకాలు అందజేయనున్నట్లు తెలిపింది. ఇందులో 275 మందికి పోలీస్ మెడల్ ఫర్ గ్యాలంట్రీ, ఇద్దరికి ప్రెసిడెంట్ మెడల్ ఫర్ గ్యాలంట్రీ, 102 మందికి రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలు, 753 మందికి పోలీస్ విశిష్ట సేవా పతకాలను ప్రకటించింది.

ఈ పురస్కారాల్లో తెలంగాణ నుంచి 20, ఆంధ్రప్రదేశ్ నుంచి 9 మందికి పతకాలు దక్కాయి. ఏపీలో 9 మందికి పోలీసు విశిష్ట సేవా పతకాలు ఇవ్వనున్నారు. తెలంగాణ నుంచి ఆరుగురు మెడల్ ఫర్ గ్యాలంట్రీ, ఇద్దరికి రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలు, 12 మంది పోలీసు విశిష్ట సేవా పతకాలు అందుకోనున్నారు. తెలంగాణ అదనపు డీజీపీలు సౌమ్యా మిశ్రా, దేవేంద్ర సింగ్ చౌహాన్‌కు రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలు దక్కాయి. అలాగే గ్యాలంట్రీ పతకాలు దక్కించుకున్న 277 మందిలో అత్యధికంగా జమ్మూకశ్మీర్ నుంచి 72 మంది పోలీసులు, ఛత్తీస్‌గఢ్ నుంచి 26, ఝార్కండ్ నుంచి 23, మహారాష్ట్ర నుంచి 18 మంది ఉన్నారు. సీఆర్పీఎఫ్‌నుంచి 65, సశస్త్ర సీమాబల్ నుంచి 21 మంది ఈ పతకాలు అందుకోనున్నారు. లెఫ్ట్ వింగ్ తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో విధులు నిర్వర్తిస్తున్న 119 మంది, జమ్మూకశ్మీర్‌లో పనిచేస్తున్న 133 మందికి ఈ మెడల్స్ దక్కాయి.

## రేపు మండల సర్వసభ్య సమావేశం

### - ఎంపీడీవో శివ నాగజ్యోతి



**టీ మీడియా, జనవరి 25, మహానంది:** మహానంది మండలం తిమ్మాపురం గ్రామంలోని మండల పరిషత్ కార్యాలయంలో మండల అధ్యక్షురాలు బుడ్డారెడ్డి యశస్విని అధ్యక్షతన శనివారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో శివ నాగజ్యోతి పేర్కొన్నారు. గురువారం ఎంపీడీవో మాట్లాడుతూ ఈ సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు ప్రారంభం అవుతుందని, మండలంలోని అన్ని శాఖల అధికారులు శాఖల వారీగా నివేదికలతో హాజరుకావాలన్నారు. అలాగే మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, జెడ్పిటిసిలు, కోఆప్షన్ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

## విద్యార్థులకు కంటి పరీక్షలు




**టీ మీడియా, జనవరి 25, పెద్దపల్లి :** మండలంలోని తుర్కలమద్దికుంట జడ్పీ ఉన్నత పాఠశాల లో చదువుతున్న పదోవ తరగతి విద్యార్థులకు గురువారం రోజున లయన్స్ క్లబ్ ఆఫ్ విజన్ కేర్‌ఆధ్వర్యంలో నేత్రవైద్య సహాయకులు లయన్ అబ్దుల్ వాసే కంటి పరీక్షలు నిర్వహించారని క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు లయన్ పూదరి దత్తాగౌడ్ తెలిపారు. అనంతరం మాట్లాడుతూ పాఠశాలలోని 24 మంది పదోవ తరగతి విద్యార్థులకు పరీక్షలు నిర్వహించగా,ఇద్దరికి దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించామన్నారు. విద్యార్థులు ఎప్పటి కప్పుడు కంటి పరీక్షలు చేసుకొని చూపు తగ్గకుండా జాగ్రత్త పడాలన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ జయప్రద సంజీవ్ రెడ్డి,వార్డు సభ్యులు తాజుద్దీన్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## టీ మీడియా క్యాలెండర్ ను ఆవిష్కరించిన గోదావరిఖని 2 టౌన్ సీఐ




**టీ మీడియా, జనవరి 25, రామగుండం:** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని గోదావరిఖని 2టౌన్ పోలీస్ స్టేషన్లో సీఐ వేణుగోపాల్ చేతుల మీదుగా గురువారం టీ మీడియా 2024 క్యాలెండర్ ఆవిష్కరణ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో స్టేషన్ రెండవ సీఐ,స్టేషన్ సిబ్బంది, క్రైమ్ రిపోర్టర్ వినయ్ పాల్గొనడం జరిగింది.

## అంగన్వాడీ కేంద్రానికి పరుగులు తీస్తూ వస్తున్న చిన్నారులు



**టీ మీడియా, జనవరి 25, మహానంది:** అమ్మల ఆదరించే అంగన్వాడి కేంద్రానికి కార్యకర్తల సమ్మెతో 43 రోజులతో దూరమైన పిల్లలు ఎంతో వ్యధకు గురయ్యారు. వారి సమ్మె విరమణ అనంతరం అంగన్వాడి కేంద్రాలు తెరచుకోవడంతో పిల్లలు పలక బలపం పట్టుకొని పరుగులు తీస్తూ ఎంతో ఉత్సాహంగా అంగన్వాడి కేంద్రాలకి వస్తున్నారు. గురువారం మహానంది మండలం ఆర్ఎస్ గాజులపల్లె గ్రామంలోని మొదటి అంగన్వాడి కేంద్రం నిర్వాహకులు జ్యోతి ఉషారాణి వీధులకు రాగానే పిల్లలు ఆనందంగా చేరుకున్నారు. ఆమె ఆ పిల్లలను అక్కున చేర్చుకొని ఆ పిల్లలతో ముచ్చట్లు జరిపి ఆనందాన్ని నింపారు.

# భూకబ్జాదారులపై ఉక్కుపాదం..

# 150 ఎకరాలకుపైగా హామ్ ఫట్

### -ఫిర్యాదుల పరంపర,పలువురికి నోటీసులు

**టి మీడియా జనవరి 25,కరీంనగర్:** కమిషనరేట్ పరిధిలో భూ దందాలకు సంబంధించిన వ్యవహారంలో ఫిర్యాదుల పరంపర కొనసాగుతూనే ఉంది. నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం ఆరంభం కావడంతో బాధితులు ఒక్కొక్కరుగా పోలీసులను ఆశ్రయించడం మొదలైంది. ప్రభుత్వ భూములుతోపాటు ప్రయివేట్ భూములను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ పెరుగుతుంది. కరీంనగర్‌కు చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్పోరేటర్ తోట రాములు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అనుచరుడిగా చెప్పుకుంటున్న చీటి రామారావులను అరెస్ట్ చేసిన తరువాత భరోసాతో ఠాణా మెట్లెక్కేవారి సంఖ్య పెరిగిపోతోంది. అక్రమార్కులపై ఉక్కుపాదం మోపాలని కరీంనగర్ సీపీ అభిషేక్ మహంతి నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా ఎకనామిక్ అఫెన్సెస్ వింగ్ (ఈఓడబ్లూ) పేరిట ప్రత్యేకంగా ఓ టీమ్ కూడా ఏర్పాటు చేశారు. బాధితులు తమకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఒక్కో కేసును దర్యాప్తు చేసే పనిలో నిమగ్నం అయింది కరీంనగర్ పోలీసు యంత్రాంగం. రెండు రోజుల క్రితం అరెస్టుల పరంపర మొదలు కావడంతో బాధితులకు కమిషనర్ కార్యాలయానికి క్యూ కడుతున్నారు. గురు, శుక్రవారాల్లో పెద్ద సంఖ్యలో బాధితులు తమ గోడు చెప్పుకునేందుకు సీపీ అభిషేక్ మహంతిని కలిశారు. బాధితులు చెప్పిన వివరాలను విన్న సీపీ సంబంధిత పోలీసు స్టేషన్లకు విచారణకు ఆదేశిస్తున్నారు.

### పురుమళ్ల శ్రీనివాస్ పై వరుస ఫిర్యాదులు

కరీంనగర్ సమీపంలో ఉన్న బొమ్మకల్ లో ప్రభుత్వ భూములు బడా భూములు ఆక్రమించారు. చాలా ఏళ్లుగా పలువురు పోరాటం చేస్తున్నారు. అయినా అధికారుల నుంచి స్పందన రావడం లేదు. దీంతో మరో సారి.. బొమ్మకల్ సర్పంచ్, కరీంనగర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పురుమళ్ల శ్రీనివాస్ పై బాధితులు కరీంనగర్ పోలీసు కమిషనర్ కు ఫిర్యాదు చేశారు. సర్పంచ్ పదవి అడ్డు పెట్టుకుని నకిలీ పత్రాలు సృష్టించాడని బాధితులు ఆరోపించారు. 30 మందికి పైగా బాధితులము పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశామని, రెవెన్యూ రికార్డులు కూడా తారుమారు చేశాడని బాధితులు పురుమళ్ల శ్రీనివాస్ పై ఫిర్యాదు చేశారు. శ్రీనివాస్ తో పాటు అతని అనుచరుల వల్ల తమకు ప్రాణహాని ఉందన్న బాధితులు గతంలో అతనిపై పీడీ యాక్టు పెట్టలేదని వివరించారు. కేవలం శ్రీనివాస్ కాదు చాలా మంది వీటి పై కన్ను వేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఇంటి నెంబర్ తో రిజిస్టర్ చేయించుకున్నారు. పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి ప్రభుత్వ భూమి ఆక్రమించారాని గతంలో పిర్యాదు చేశారు. అదేవిధంగా రేకుర్తి, బ్యాంకు కాలనీలో పలువురు భూములు ఆక్రమించారు. తీగలగుంటపల్లిలో కూడా ల్యాండ్ మాఫియా రెచ్చిపోయింది. డబుల్ రిజిస్టర్ చేసిన కేసులు అధికంగా ఉన్నాయి. ఎక్కవగా బీఆర్ఎస్ నేతలపై పిర్యాదులు వస్తున్నాయి. అక్రమాల వ్యవహారంలో పంజా విసురుతున్న కరీంనగర్ సీపీ అభిషేక్ మహంతి ఫిర్యాదుల రాగానే కేసులు నమోదు చేసే విధానానికి ప్రాధాన్యత ఇవ్వడం లేదు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదులు, ఆధారాలను క్షుణ్ణంగా పరిశీలించిన తరువాత క్షేత్ర స్థాయిలో విచారణ జరిపేందుకు కూడా ప్రత్యేకండా టీమ్స్ ను ఏర్పాటు చేశారు. ఫీల్డ్ విజిట్ చేసిన తరువాత, బాధితులతో పాటు సాక్షుల నుండి వివరాలు సేకరించి వివిధ సెక్షన్లలో కేసులు నమోదు చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. భూ దందాలకు పాల్పడిన నిందితులకు శిక్షలు ఖచ్చితంగా పడాలన్న లక్ష్యంతో పకడ్బందీగా కేసులు నమోదు చేస్తున్నారు. దీనివల్ల అక్రమాలు చేసేందుకు సాహసించే పరిస్థితి భవిష్యత్తులో కూడా రాకూడదని సీపీ యోచిస్తున్నట్టుగా తెలుస్తోంది. సామాన్యుల జీవితాలతో చెలగాటమాడుతున్న వారి భరతం పడితే తప్ప అక్రమ వ్యవహారాలకు ఫుల్ స్టాప్ పడే అవకాశం లేదని గుర్తించే అభిషేక్ మహంతి కఠినంగా వ్యవహరిస్తున్నారు. తన భూమి అక్రమణ చేసేందుకు.. బీఆర్ఎస్ నేతలు ప్రయత్నం చేశారని బాధితుడు రాజురెడ్డి అంటున్నారు.బీఆర్ఎస్ పార్టీ కార్పోరేటర్ తోట రాములు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అనుచరుడిగా చెప్పుకున్న చీటి రామారావులను అరెస్ట్ చేసిన తరువాత భరోసాతో ఠాణా మెట్లెక్కేవారి సంఖ్య పెరిగిపోతోంది. అక్రమార్కులపై ఉక్కుపాదం మోపాలని కరీంనగర్ సీపీ అభిషేక్ మహంతి నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా ఎకనామిక్ అఫెన్సెస్ వింగ్ (ఈఓడబ్లూ) పేరిట ప్రత్యేకంగా ఓ టీమ్ కూడా ఏర్పాటు చేశారు. బాధితులు తమకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఒక్కో కేసును దర్యాప్తు చేసే పనిలో నిమగ్నం అయింది కరీంనగర్ పోలీసు యంత్రాంగం. రెండు రోజుల క్రితం అరెస్టుల పరంపర మొదలు కావడంతో బాధితులకు కమిషనర్ కార్యాలయానికి క్యూ కడుతున్నారు. గురు, శుక్రవారాల్లో పెద్ద సంఖ్యలో బాధితులు తమ గోడు చెప్పుకునేందుకు సీపీ అభిషేక్ మహంతిని కలిశారు. బాధితులు చెప్పిన వివరాలను



విన్న సీపీ సంబంధిత పోలీసు స్టేషన్లకు విచారణకు ఆదేశిస్తున్నారు.

### పురుమళ్లపై..

బొమ్మకల్ సర్పంచ్, కరీంనగర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పురుమళ్ల శ్రీనివాస్ తో పాటు అతని అనుచరుల వల్ల తమకు ప్రాణహాని ఉందన్న బాధితులు గతంలో అతనిపై పీడీ యాక్టు పెట్టలేదని వివరించారు.

అక్రమాల వ్యవహారంలో పంజా విసురుతున్న కరీంనగర్ సీపీ అభిషేక్ మహంతి ఫిర్యాదుల రాగానే కేసులు నమోదు చేసే విధానానికి ప్రాధాన్యత ఇవ్వడం లేదు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదులు, ఆధారాలను క్షుణ్ణంగా పరిశీలించిన తరువాత క్షేత్ర స్థాయిలో విచారణ జరిపేందుకు కూడా ప్రత్యేకండా టీమ్స్ ను ఏర్పాటు చేశారు. ఫీల్డ్ విజిట్ చేసిన తరువాత, బాధితులతో పాటు సాక్షుల నుండి వివరాలు సేకరించి వివిధ సెక్షన్లలో కేసులు నమోదు చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. భూ దందాలకు పాల్పడిన నిందితులకు శిక్షలు ఖచ్చితంగా పడాలన్న లక్ష్యంతో పకడ్బందీగా కేసులు నమోదు చేస్తున్నారు. దీనివల్ల అక్రమాలు చేసేందుకు సాహసించే పరిస్థితి భవిష్యత్తులో కూడా రాకూడదని సీపీ యోచిస్తున్నట్టుగా తెలుస్తోంది. సామాన్యుల జీవితాలతో చెలగాటమాడుతున్న వారి భరతం పడితే తప్ప అక్రమ వ్యవహారాలకు ఫుల్ స్టాప్ పడే అవకాశం లేదని గుర్తించే అభిషేక్ మహంతి కఠినంగా వ్యవహరిస్తున్నారు. ఈ సమస్య పరిష్కారం అయిందని అంటున్నారు. వేయిల కోట్ల రూపాయల ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్నారని స్థానికులు చెబుతున్నారు. 200 ఎకరాల వరకు ఆక్రమించారని అంటున్నారు. భూ అక్రమణ కు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామని పోలీసులు చెబుతున్నారు.

## జీవో నెంబర్ 55 ను వెంటనే వెనక్కి తీసుకోవాలి

### - ఏబీవీపీ జిల్లా కన్వీనర్ బండి రాజశేఖర్




**టీ మీడియా, జనవరి 25, పెద్దపల్లి :** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఏబీవీపీపెద్దపల్లి నగర శాఖ ఆధ్వర్యంలో వ్యవసాయ ఉద్యాన వర్సిటీ భూములు లను హైకోర్టుకు కేటాయించవద్దు జీవో నెంబర్ 55ను గవర్నమెంట్ వెంటనే వెనక్కి తీసుకోవాలి అని నిన్న యూనివర్సిటీ వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థుల పైన రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీ పైన పోలిసులు క్రూరంగా జుట్టు పట్టుకొని బైక్ పైన లాగుతూ వెళ్లడం ఇది రాష్ట్ర ప్రభుత్వం యొక్క దుర్మార్గ పాలనకు నిదర్శనం అని వెంటనే దీనికి కారణమైన కానిస్టేబుల్స్ పైన వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తు పెద్దపల్లి నగర శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం యొక్క దిష్టిబొమ్మను దహనం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏబీవీపీ పెద్దపల్లి జిల్లా కన్వీనర్ బండి రాజశేఖర్ మాట్లాడుతూ.. వ్యవసాయ, ఉద్యాన వర్సిటీ భూములను హైకోర్టుకు కేటాయించవద్దని గత నెల రోజులుగా యూనివర్సిటి వద్ద ఏబీవీపీ నిరసనలు, ధర్నా లు చేయడం జరుగుతుంది. అగ్రికల్చర్ వర్సిటీ అంటేనే తెలంగాణ రాష్ట్రంలో ఉన్నటువంటి వ్యవసాయ రంగానికి మేలు చేకూర్చి దేశంలోనే అగ్రగావి రాష్ట్రంగా మార్చాలె ,రైతులకు నష్టాలు జరగకుండా రైతులు పండించే ప్రతి పంటకు లాభం వచ్చే విధంగా నూతన వంగడాలను విత్తనాలను పై పరిశోధన, అభివృద్ధి కోసం ఏర్పాటు చేయబడిన వర్సిటీ అలాంటి వర్సిటీలో 35 సంవత్సరాలుగా మెడిసిన్ ప్లాంట్స్, వెజిటేబుల్స్ సీడ్స్ ఆ గ్రూప్ లు ఫారెస్ట్రీ మొదలగు వాటిపై ఎన్నో రకాల పరిశోధనలు జరిగి తెలంగాణ రాష్ట్రంలో రైతులను, రైతాంగాన్ని పటిష్టం చేయడానికి ఎనలేని కృషి చేయడం కానీ నేడు అగ్రో బయోడైవర్సిటీ కొనసాగుతున్న పార్కులో రాష్ట్ర హైకోర్టుకు సంబంధించిన భవనాలను కట్టడానికి జీవో నెంబర్ 55ను తీసుకువచ్చి యూనివర్సిటీలో దాదాపుగా 100 ఎకరాల భూమిని తీసుకోవడానికి ప్రభుత్వం ముందుకొచ్చింది కానీ హైకోర్టు బిల్డింగ్ ను ఈ ప్రాంగణంలో కట్టొద్దని ఏబీవీపీ తీవ్రంగా వ్యతిరేకిస్తుంది.

అగ్రికల్చర్ వర్సిటీలో హైకోర్టు భవనాలను కట్టడం అంటే తెలంగాణ రాష్ట్రంలోని వ్యవసాయ రంగాన్ని తుంగలో తొక్కి వ్యవసాయ అభివృద్ధికి అడ్డుకట్ట వేయడమేనని అదేవిధంగా గ్రామీణ విద్యార్థులు విద్యను దూరం చేసి పరిశోధనలు జరగకుండా ప్రభుత్వం కుట్ర పొందుతుందని ఏబీవీపీ తెలిపింది. కాబట్టి ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి వర్సిటీ భూములను హైకోర్టుకు కేటాయించి నిర్ణయం వెనక్కి తీసుకోవాలి లేని పక్షంలో ఏబీవీపీ రాష్ట్రవ్యాప్త ఉద్యమాన్ని కార్యచరణ రూపొందించి యూనివర్సిటీలో గుంట భూమి కూడా వదలమని ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఏబీవీపీ హెచ్చరిస్తుంది.అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ బండి రాజశేఖర్ నగర కార్యదర్శి అజయ్, జోనల్ ఇన్చార్జులు, అరవింద్, రాకేష్, నాయకులు వంశీ, సాయి తేజ, శ్రీ దత్త, ఆదిత్య, విష్ణు, గణేష్, శివ, సూర్య, మారుతి, అభిషేక్, ప్రవీణ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఓరుగల్లు బాలికకు అరుదైన గౌరవం..

### -రాష్ట్రపతి చేతుల మీదుగా పురస్కారం




**టీ మీడియా, జనవరి 25, వరంగల్ :** కళలకు కాణాచిగా పేరుగాంచిన కాకతీయుల రాజధాని నగరం వరంగల్ నుంచి ఓ బాలిక యావద్దేశం దృష్టిని ఆకట్టుకుంటోంది. సొగసైన కూచిపూడి నృత్యంతో గత ఏడాది జాతీయస్థాయిలో జరిగిన 'కళా ఉత్సవ్' అన్ని రకాల శాస్త్రీయ నృత్యాల్లో కూచిపూడి ప్రదర్శనతో మొదటిస్థానం సొంతం చేసుకుంది. ఇప్పుడు సాహస బాలలతో పాటు వివిధ రంగాల్లో అద్భుత ప్రతిభ కనబర్చిన బాలలకు ఇచ్చే 'జాతీయ బాల పురస్కార్' అవార్డుల్లో ఎంపికై జనవరి 22న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పురస్కారం అందుకుంది. ఆ బాలిక పెండ్యాల లక్ష్మీప్రియ. హన్మకొండకు చెందిన పెండ్యాల రాకేశ్ కుమార్, సాయిలతల కుమార్తె లక్ష్మీప్రియ కాజీపేటలోని మాంట్‌ఫోర్డ్ స్కూల్‌లో 10వ తరగతి చదువుకుంటోందిగత ఏడేళ్లుగా కూచిపూడి గురువురు సుధీర్ రావు వద్ద నాట్యం నేర్చుకుంటున్న లక్ష్మీప్రియ ఇప్పటికే అనేక అవార్డులు, రివార్డులు సొంతం చేసుకుంది. కూచిపూడితో పాటు మోహినీ అట్టంలోనూ ప్రతిభను కనబరుస్తున్న లక్ష్మీప్రియ 2020లో ఆర్ట్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించుకుని, మోహిన నాట్యంలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి 'లాస్యప్రియ' బిరుదు అందుకుంది. గత ఏడాది ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నిర్వహించిన 'పరీక్షా పే చర్చ' కార్యక్రమంలో పాల్గొని, ప్రధానితో మాట్లాడింది. అంతే కాదు, ఆయన ముందు ఓ 2 నిమిషాల నృత్య ప్రదర్శన చేసి ఆకట్టుకుంది.జనవరి 22న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా మర్నాడు ఢిల్లీలోని కర్తవ్య పథ్‌లో జరిగిన రిపబ్లిక్ డే పరేడ్ రిహార్సల్స్‌లో పాల్గొంది. అనంతరం పురస్కార విజేతలతో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మాటామంతీ నిర్వహించగా.. ఆయన లక్ష్మీప్రియను మెచ్చుకున్నారు. ఓ సాధారణ దిగువ మధ్యతరగతి కుటుంబంలో పుట్టిన లక్ష్మీప్రియ శాస్త్రీయ నృత్యంలో ప్రదర్శిస్తున్న ప్రతిభను చూసి పాఠశాల యాజమాన్యం ఉచితంగా విద్యను అందజేస్తోంది. తల్లి, అమ్మమ్మకు శాస్త్రీయ నృత్యంపై అమితమైన ఆసక్తి ఉన్నప్పటికీ ఆర్థిక పరిస్థితుల కారణంగా అందులోకి అడుగుపెట్టలేకపోయారని లక్ష్మీప్రియ చెబుతోంది. తాను నృత్యకారిణిగా మారి వారి కోరికను తీర్చానని, చిన్నతనం నుంచి కూచిపూడికి ఆకర్షితురాలనయ్యాను అని చెబుతోంది. జనవరి 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా జరిగే పరేడ్‌లో ఇతర విభాగాల్లో బాల పురస్కార్ అందుకున్న విజేతలతో కలిసి పాల్గొననుంది.

### వేదిక కావాలి..

ఏ కళాకారుడికైనా తమ కళను, ప్రతిభను ప్రదర్శించడానికి వేదిక కావాలని.. అప్పుడే వారి కళానైపుణ్యం గురించి ప్రపంచానికి తెలుస్తుందని లక్ష్మీప్రియ చెబుతోంది. ప్రస్తుతం పాఠశాల విద్యను పూర్తిచేసుకుంటున్న దశలో ఉన్న తనకు కూడా ఒక వేదికను రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తే.. తాను రాష్ట్రానికి పేరు తెచ్చేలా ప్రతిభను ప్రదర్శిస్తానని అంటోంది. తల్లిదండ్రులు, గురువుతో పాటు తాను చదువుకుంటున్న పాఠశాల యాజమాన్యం ప్రోత్సాహం వల్లనే బాల పురస్కార్ వరకు చేరుకోగలిగానని, రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రోత్సహిస్తే ఇలాంటి కళలను భావితరాలకు అందిస్తూ హైందవ సాంప్రదాయాలను, సనాతన ధర్మాన్ని ముందుకు తీసుకెళ్లవచ్చని చెబుతోంది. 'కళా ఉత్సవ్'లో దేశవ్యాప్తంగా అనేక మంది శాస్త్రీయ నృత్యంలోని భరతనాట్యం, కథక్ సహా అనేక నృత్యరూపకాలను ప్రదర్శించగా, తాను ప్రదర్శించిన కూచిపూడి ప్రదర్శన మొదటి స్థానం కైవసం చేసుకోవడం గర్వంగా ఉందని చెబుతోంది.

### ఆర్థిక చేయూత అవసరం: సుధీర్ రావు

గతంలో కళాకారులు కేవలం కళను మాత్రమే నమ్ముకుని గురువులకు సేవ చేస్తూ నేర్చుకున్నామని, కానీ ఈ పోటీ యుగంలో కళాకారులు విద్యాభ్యాసాన్ని కూడా సమాంతరంగా కొనసాగించక తప్పని పరిస్థితి ఉందని లక్ష్మీప్రియ నాట్యగురువు సుధీర్ రావు అన్నారు. కళా ప్రదర్శన ఖర్చుతో కూడుకున్న వ్యవహారమని, ధనిక కుటుంబాల నుంచి వచ్చినవారికి ఇబ్బంది లేకపోయినా పేద, మధ్యతరగతి కుటుంబాల నుంచి వచ్చినవారికి మాత్రం కళల్లో కొనసాగాలంటే ఆర్థికంగా చేయూత అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. రాష్ట్ర సాంస్కృతిక శాఖ నుంచి ప్రోత్సాహం ఉందని, అయితే ఆర్థిక చేయూత కూడా అందిస్తే ఇలాంటి కళాకారులను మరింతమందిని తయారు చేయడానికి వీలుంటుందని చెప్పా




## ప్రగతి పనులను నిలిపివేయం

### -మంత్రి శ్రీధర్ బాబు

**టి మీడియా జనవరి 25,హైదరాబాద్:** గత ప్రభుత్వం చేపట్టిన ప్రగతి పనులను కాంగ్రెస్ సర్కార్ నిలిపివేయదని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. రాష్ట్ర ప్రగతే తమ విజన్ అని చెప్పారు. అభివృద్ధిలో దేశంలోనే అగ్రగామిగా ఉండాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రతి రాష్ట్రం హైదరాబాద్ వైపు చూస్తున్నదని వెల్లడించారు. హైదరాబాద్‌లోని హోటల్ ఐటీసీ కాకతీయలో సీఐఐ తెలంగాణ ఇన్‌ఫ్రా రియల్ ఎస్టేట్ సదస్సును మంత్రి శ్రీధర్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 3 దశాబ్దాలుగా స్థిరాస్తి రంగం ఎంతో పుంజుకుందన్నారు. సుస్థిరమైన విధానంలో స్థిరాస్తి రంగం అభివృద్ధి కోసం కృషి చేస్తామని తెలిపారు. విధానపరమైన నిర్ణయాల్లో పారిశ్రామికవేత్తల సహకారం అవసరం. పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. దావోస్ పర్యటనలో మౌలిక వసతులపై కూడా చర్చించామని వెల్లడించారు.చేసే పనిలో డిజైన్, నాణ్యత, స్థిరత్వం విషయంలో పారిశ్రామిక వేత్తలు సరైన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఇదే మన పారిశ్రామిక విధానంలో ప్రతిబింబిస్తుందని తెలిపారు. మీ వినూత్న ఆలోచనలే రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు.

### భర్త వేధింపులు భరించలేక

## భార్య ఆత్మహత్య



**టీ మీడియా, జనవరి 25, వరంగల్ :** జిల్లా చెన్నారావుపేట మండలంలోని జల్లి గ్రామ తండాలో గురువారం ఉదయం విషాదం చోటుచేసుకుంది. భర్త వేధింపులు తాళలేక భార్య పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. తండాకు చెందిన జర్పుల ప్రవీణ్ కి స్వరూపతో 24 సంవత్స రాల క్రితం వివాహమైంది. ప్రవీణ్ పెండ్లి అయినప్పటి నుండి స్వరూప ను ఇష్టానుసారంగా కొట్టేవాడు. అతని వేధింపులతో గతంలోనే భార్య రెండు సార్లు చావడానికి ప్రయత్నం చేసింది. ఎన్నోసార్లు పెద్దమనుషులు పంచాయతీలు చేసి భార్యాభర్తల మధ్య సర్దుబాటు చేశారు.వీరి కుమారుడు ఇటీవలే చేసుకున్న వివాహం విషయంలోనూ స్వరూపను ప్రవీణ్ నువ్వే కారణ మంటూ కొట్టాడు. బుధవారం సాయంత్రం మద్యం మత్తులో ఇంటికి వచ్చి స్వరూపను తీవ్రంగా కొట్టి, ఏదైనా మందు తాగి చావు అని బెదిరించాడు.దీంతో భర్త టార్చర్ భరించలేక స్వరూప బుధవారం రాత్రి పురుగుల మందు తాగగా, కుటుంబ సభ్యులు గమనించి ఆమెను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలోనే చనిపోయిం ది. మృతురాలి తల్లి భూక్య మల్లికాంబ ఫిర్యాదు మేరకు ప్రవీణ్ పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ పి.శ్రీనివాస్ తెలిపారు.

## ప్రచారంలో అభ్యర్థుల వ్యాఖ్యలపై గవర్నర్ సీరియస్
## అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలి



**టి మీడియా జనవరి 25,హైదరాబాద్:**జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న గవర్నర్ తమిళసై.. ఎన్నికల ప్రచారంలో అభ్యర్థులు చేసే కామెంట్స్‌పై సీరియస్ అయ్యారు. ఓటు వేయకపోతే ఆత్మహత్య చేసుకుంటా అని ఓ అభ్యర్థి ఎన్నికల ప్రచారంలో అన్నారని గవర్నర్ గుర్తు చేశారు. ఇలాంటి కాంట్రవర్షల్ కామెంట్స్ చేసే వారిపైన చర్యలు తీసుకోవాలని ఎన్నికల అధికారులకు సూచించారు.జేఎన్టీయూ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎన్నికల అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న గవర్నర్.. మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థి వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తూ ఓటు అడగడం కరెక్ట్ కాదని ఇలాంటి వాటిపైనే చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఓటర్లను ఎవరూ ఫోర్స్ చేయొద్దని.. ఓటు శాతం పెరగడానికి ప్రకటనలు ఒక్కటే ఉపయోగపడవు అని అన్నారు. ప్రతి ఓటర్‌కి ఓటు మోస్ట్ పవర్‌ఫుల్ ఆయుధం అని అన్నారు. డెమోక్రసీ బతకాలి అంటే అందరూ ఓటు వేయాలని యువతకు తెలిపారు గవర్నర్‌ఓటర్ అనే వ్యక్తి తప్పకుండా ఓటు వేయాలని ఈవీఎం బాక్స్‌పైన నోటా అనే ఆప్షన్ ఉన్నప్పటికీ దానికి నేను వ్యతిరేకమని ఈ కార్యక్రమంలో గవర్నర్ అన్నారు. మంచి అభ్యర్థిని ఓటర్ ఎన్నుకుంటే మంచి పాలన అందుతుంది. ప్రతి ఒక్కరూ ఓటు వేయాలన్నారు. ఈ సందర్భంగా గత ఎన్నికల్లో అభ్యర్థి ఓటు వేయకపోతే కుటుంబంతో సహా ఆత్మహత్య చేసుకుంటానని అనడం బాధించిందని ఇలా ఓటు అడిగిన అభ్యర్థిపై చర్యలు తీసుకోవాలని ఇలాంటి మాటలకు ఎవరు లొంగవద్దని ఓటర్లకు సూచించారు గవర్నర్.

### విషయం ఏంటంటే.?

అసెంబ్లీ ఎన్నికల ప్రచారం ఆఖరు దశలో గతేడాది నవంబర్ 28న పాడి కౌశిక్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారిన సంగతి తెలిసిందే. హుజురాబాద్‌లో తనను గెలిపిస్తే విజయయాత్రకు వస్తానని.. ఓడిస్తే శవయాత్రకు రండి.. అంటూ ఆరోజు మాట్లాడారు. దండం పెడుతున్నా.. కాళ్లు పట్టుకుంటున్నా.. ఒక్క అవకాశం ఇవ్వండి అంటూ ప్రచారంలో వేడుకున్నారు. గవర్నర్ తమిళిసై ఇప్పుడు ఈ వ్యాఖ్యలనే ప్రస్తావించారు. ఓటు వేయకపోతే ఆత్మహత్య చేసుకుంటానని.. ఓ అభ్యర్థి ఎన్నికల ప్రచారంలో బెదిరించారని చెప్తూ ఇలాంటివారిపై ఎలక్షన్ కమిషన్ చర్యలు తీసుకోవాలని కోరారు.



## పంచాయతీ ఎన్నికలు ఇప్పట్లో నిర్వహించలేం : మంత్రి సీతక్క

**టి మీడియా జనవరి 25,రాజన్న సిరిసిల్ల :** సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో వేములవాడ దేవస్థాన అభివృద్ధికి సంబంధించిన సమావేశం ఏర్పాటు చేస్తామని పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. గురువారం వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని మంత్రి కుటుంబ సభ్యులు, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌తో కలిసి దర్శించుకున్నారు. ఉదయం ఆలయ అతిథి గృహానికి చేరుకున్న మంత్రికి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్ పూల మొక్కలు బహూకరించి సాదర స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం మంత్రి స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..మన పూర్వీకులు మనకు వారసత్వంగా ఇచ్చిన తెలంగాణలోని రాజన్న ఆలయం, సమ్మక్క %--% సారక్క జాతర, ఇతర ఆధ్యాత్మిక క్షేత్రాలను అభివృద్ధి చేసుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం పైన ఉందన్నారు. పంచాయతీ ఎన్నికలు ఇప్పటికిప్పుడు నిర్వహించే పరిస్థితి లేదని ఆమె తెలిపారు. దానికి సంబంధించి ఎట్లా చేయాలో అనేది ఇవాళ, రేపు నిర్ణయిస్తామన్నారు.

## దోమల బెడదతో బెంబేలెత్తుతున్న భక్తులు



**టీ మీడియా, జనవరి 25, మహానంది:** ప్రముఖ శైవ క్షేత్రం మహానంది పుణ్య క్షేత్రంలో స్వామి అమ్మవార్ల దర్శనార్థమై ప్రతినిత్యం భక్తులు వేల సంఖ్యలో క్షేత్రానికి వస్తుంటారు. గత కొద్దిరోజులుగా సాయంత్రం సమయం నుండి రాత్రి వరకు దోమలు అధికంగా ఉండడంతో భక్తులు తీవ్ర భయాందోళనకు గురవుతున్న పరిస్థితి నెలకొంది. క్షేత్రానికి వచ్చిన భక్తులు ఈ దోమలతో టైఫాయిడ్, మలేరియా జ్వరాలు వస్తాయేమోనని భయాందోళనలకు గురి అవుతున్నారు. ఆలయ అధికారులు భక్తుల కోసం క్షేత్ర పరిధిలో ఫాగింగ్ చేయించి దోమల బెడద నుండి కాపాడాలని భక్తులు, స్థానికులు కోరుతున్నారు.

## ముస్లింల విద్యా ప్రమాణాలను మెరుగు పరిచేందుకు ఎంఐఎం కృషి
### - కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్



**టీ మీడియా, జనవరి 25, పెద్దపల్లి :** తెలంగాణ రాష్ట్రంలో ముస్లింల విద్యా ప్రమాణాలు పెంచేందుకు ఎంఐఎం పార్టీ విశేషంగా కృషి చేస్తుందని, ఉర్దూను తెలంగాణ రాష్ట్రంలో రెండవ అధికార భాషగా గుర్తించేందుకు ఎంఐఎం పార్టీ విశేషంగా కృషి చేసిందని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. గురువారం పెద్దపల్లి పట్టణంలోని ఉర్దూ మీడియం బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సాలారే మిల్లత్ ఆల్ ఇన్ వన్ 2024 గైడ్స్ ను పెద్దపల్లి పట్టణంలోని ప్రభుత్వ ఉర్దూ మీడియం పాఠశాలల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ మాట్లాడుతూ.. విద్యార్థులందరూ ముఖ్యంగా బాల, బాలికలు కష్టపడి చదివి తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, జీవితంలో పదవ తరగతి వార్షిక పరీక్ష కీలకమని, ఈ పరీక్షలో ఉత్తీర్ణులు అవ్వడానికి సాలారే మిల్లత్ గైడ్ దోహదపడుతుందని అన్నారు. మాజీ ఎంపీ దివంగత సుల్తాన్ సలావుదినవైసీ భవిష్యత్ తరాలకు ఉన్నత విద్యను అందించాలనే సంకల్పంతో గత 20 సంవత్సరాల క్రితం ఆల్ ఇన్ వన్ గైడ్లను ఎంఐఎం పార్టీ తరపున ఉచితంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అందజేస్తున్నట్లు, సాలారే మిల్లత్ తర్వాత, తమ అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఒవైసీ, శాసనసభ పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీలు తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో ఉర్దూను బ్రతికించడం కోసం ఉర్దూ మీడియం పాఠశాలల విద్యా ప్రమాణాలు పెంచడం కోసం, ముస్లింల విద్య అభివృద్ధి కోసం అమోఘమైనటువంటి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఎంఐఎం పార్టీ నగర అధ్యక్షుడు, తెలంగాణ హజ్ కమిటీ సభ్యుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ.. తమ అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఒవైసీ, శాసనసభ పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీల సారథ్యంలో.. హైదరాబాద్ నగరవ్యాప్తంగా పేద ముస్లింల పిల్లలకు బాసటగా నిలవాలని సంకల్పంతో కార్పొరేట్ స్థాయిలో 30 పాఠశాలలను స్థాపించి, 30 వేల మంది విద్యార్థులకు ఏటా విద్యను ఉచితంగా అందిస్తున్నటువంటి ఘనత వీరికి దక్కుతుందన్నారు. ముస్లిం యువత చెడు వ్యసనాలను మాని ఉన్నతమైనటువంటి చదువులు చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించి రాజకీయాల్లో రాణించాలని తమ అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీ పిలుపునిచ్చారని గుర్తుచేశారు. మాట్లాడుతూ సాలరే మిల్లత్ గైడ్స్ ను దివంగత సుల్తాన్ సలావుద్దీన్ నాడు భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా ఈవిద్యా ప్రణాళికను తయారు చేశారని ఆయన గొప్ప సంకల్పంతో నేడు ముస్లింలు క్రీడల్లో, ఉన్నత విద్యలో, సివిల్స్ ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్, గ్రూప్1 వంటి ఉద్యోగాల్లో, డాక్టర్లుగా, ఇంజనీర్లుగా , ఇటు రాజకీయాల్లో రాణిస్తున్నారని చెప్పారు. ఈకార్యక్రమంలో ఎంఐఎం పార్టీ నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్, జిహెచ్ఎంసి నానల్ నగర్ కార్పొరేటర్ నసీరుద్దీన్, ఎంఐఎం పార్టీ జిల్లా నాయకుడు ఇమ్రాన్ అడ్వకేట్ పెద్దపల్లి ఎంఐఎం పట్టణ అధ్యక్షుడు ప్రధాన కార్యదర్శి ఇమ్రాన్, మొయిజ్, జియా, కలీమ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిపక్ష పార్టీని గౌరవిస్తాం,
## అలుసుగా తీసుకుంటే బుద్ధి చెప్పుతాం
### బీఆర్ఎస్ నేతలపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆగ్రహం




**టి మీడియా జనవరి 25,హైదరాబాద్ :** బీఆర్ఎస్ నేతలపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతలు బట్టలు ఊడదీసి కొడతామంటే కాంగ్రెస్ కార్యకర్తలు చేతులు ముడుచుకుని కూర్చోలేదని అన్నారు. ఎల్బీ స్టేడియంలో నేడు జరిగిన తెలంగాణ కాంగ్రెస్ పార్టీ బూత్ లెవెల్ లీడర్స్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ కార్యకర్తలంతా ఒక్కసారి కన్నెర్ర జేస్తే రాష్ట్రంలో టీఆర్ఎస్ అలియాస్ బీఆర్ఎస్ మిగలదంటూ వార్నింగ్ ఇచ్చారు. అయితే.. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష పార్టీని గౌరవించడం చేతగాని తనంగా భావించొద్దని చెప్పారు. తాము ప్రతిపక్షాన్ని గౌరవిస్తున్నామనీ..కానీ దాన్ని చేతగాని తనంగా భావించి నోటికొచ్చినట్లు మాట్లాడితే ఊరుకోమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు..ఆరు గ్యారెంటీల్లో రెండు హామీలను అధికారంలోకి వచ్చిన రెండ్రోజుల్లోనే అమలు చేశామన్నారు డిప్యూటీ సీఎం భట్టి. మతం పేరిట ఆర్థిక వ్యవస్థను విడదీసి దేశంలో విద్వేషాన్ని బీజేపీ పార్టీ రెచ్చగొడుతోందని ఆరోపించారు. ఈ క్రమంలో మతసామరస్యాన్ని కాపాడాలనే రాహుల్‌గాంధీ భారత్ జోడో న్యాయ్ యాత్ర చేస్తున్నారని అన్నారు. తన సందేశాన్ని పాదయాత్ర ద్వారా గడపగడపకు తీసుకెళ్తున్నారని అన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చూపించనుందని అన్నారు. తెలంగాణ నుంచే 15 సీట్లు గెలిపించాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీకి ప్రజలంతా మద్దతుగా నిలవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కోరారు. కాంగ్రెస్ కార్యకర్తలంతా గౌరవంగా తలెత్తుకునే విధంగా ఇందిరమ్మ రాజ్యంలో ప్రజాపాలన అందిస్తామని చెప్పారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు వచ్చినా అధిగమించి ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలన నిలబెట్టేందుకు కృషి చేస్తామన్నారు. ఈ దేశాన్ని పాలించే అర్హత ఉన్న పార్టీ కాంగ్రెస్ మాత్రమే అనీ.. మరే పార్టీకి ఆ అర్హత లేదని డిప్యూటీ సీఎం భట్టి అన్నారు. దశాబ్దకాలం పాటు అనేక సమస్యలను ఎదుర్కొని గత ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులు పెట్టినా మూడు రంగుల జెండాను భుజాన పెట్టుకుని మోసిన కాంగ్రెస్ కార్యకర్తలకు ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కృతజ్ఞతలు తెలిపారు

## ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి
### - ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ



**టీ మీడియా, జనవరి 25, పెద్దపల్లి :** రోడ్డు భద్రత మాషోత్సవాల సందర్భంగా పెద్దపల్లి పట్టణ కేంద్రంలోని ప్రధాన కూడాళ్ళ వద్ద హెల్మెట్ మరియు ట్రాఫిక్ రూల్స్ పై వాహనదారులకు అవగాహన కార్యక్రమంలో భాగంగా ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది తో కలిసి హెల్మెట్ ఉపయోగం, ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. హెల్మెట్ ధరించిన వాహనదారులకు చాక్లెట్ లు ఇచ్చి పెద్దపల్లి ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం తాగి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపరాదన్నారు. ద్విచక్ర వాహనంపై ముగ్గురు వెళ్లరాదని తెలిపారు. ట్రాఫిక్ జంక్షన్‌ల వద్ద, సిగ్నల్స్‌ల వద్ద నిబంధనలను అతిక్రమించ రాదని మితిమీరిన వేగంతో వాహనం నడిపేవారిపై చట్టపరంగా జరిమానాలు విధించనున్నట్లు తెలిపారు. సీటుబెల్టు ధరించి కారు నడపాలన్నారు.



## 8న ఫైనల్ ఓటర్ల జాబితా విడుదల చేస్తాం
### -సీఈఓ వికాస్‌రాజ్

**టి మీడియా జనవరి 25,హైదరాబాద్:**తెలంగాణలో లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు సిద్ధమవుతున్నట్టు తెలిపారు సీఈఓ వికాస్‌రాజ్. ఫిబ్రవరి ఎనిమిదో తేదీన ఫైనల్ లిస్ట్ ప్రకటించనున్నట్టు స్పష్టం చేశారు. ఇదే సమయంలో ఓటు హక్కు వినియోగించుకోవడం మన అందరి బాధ్యత అని కామెంట్స్ చేశారు.హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూలో నేషనల్ ఓటర్స్ డే సందర్భంగా సెలబ్రేషన్స్ జరిగాయి. ఈ కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, రాష్ట్ర ఎన్నికల అధికారి పార్థసారథి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వికాస్‌రాజ్ మాట్లాడుతూ జనరల్ ఎలక్షన్స్ ప్రశాంతంగా జరిపాం. మొదటిసారి హోం ఓటింగ్ విజయవంతంగా నిర్వహించాం. ఇప్పుడు లోక్ సభ ఎన్నికలకు సిద్ధమవుతన్నాం%ౌా% ఇందులో కూడా విజయం సాధిస్తాం.. ఓటు హక్కును వినియోగించుకోవడం మనందరి బాధ్యత అన్నారు.. ఇక తెలంగాణాలో తొమ్మిది లక్షల ఓటర్స్‌ను కొత్తగా నమోదు చేసినట్టు తెలిపారు.

## ఎన్ని ఎఫ్ఐఆర్‌లు దాఖలు చేసినా
## న్యాయ్ యాత్ర కొనసాగిస్తాం : కాంగ్రెస్



**టి మీడియా జనవరి 25,హైదరాబాద్ :** రాహుల్ గాంధీపై అసోం సీఎం హిమంత బిశ్వ శర్మ ఎన్ని ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినా దేశాన్ని ఏకం చేసేందుకు భారత్ జోడో న్యాయ్ యాత్ర కొనసాగుతుందని కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గగోయ్ గురువారం స్పష్టం చేశారు. దేశంలో అత్యంత అవినీతిపరుడైన సీఎం శర్మ నుంచి ఇంతకంటే తాము ఆశించిందేమీ లేదని దుయ్యబట్టారు. అసోం ప్రభుత్వం ఎన్ని ఎఫ్ఐఆర్‌లు దాఖలు చేసినా తమ యాత్రను కొనసాగించి తీరుతామని ఎంపీ తేల్చిచెప్పారు. మతం, భాష ఆధారంగా బీజేపీ దేశాన్ని విభజిస్తోందని, భారత్ జోడో న్యాయ్ యాత్ర ద్వారా తాము దేశంలో ఐక్యతను చాటిచెబుతామని అన్నారు. గువహటిలో అనుమతి లేకుండా యాత్రను చేపట్టి ఘర్షణలకు బాధ్యులయ్యారని ఆరోపిస్తూ రాహుల్ గాంధీ సహా పలువురు కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలపై అసోం ప్రభుత్వం ఎఫ్ఐఆర్ నమోదు చేసిన సంగతి తెలిసిందే. కాగా, రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో న్యాయ్ యాత్ర బెంగాల్‌కు చేరుకుంది. రాహుల్ యాత్ర అసోం నుంచి గురువారం ఉదయం బెంగాల్‌లోని కూచ్‌బెహార్ జిల్లాలోకి ప్రవేశించింది. మీ సమస్యలు విని మీకు సంఘీభావం తెలిపేందుకే ఇక్కడకు వచ్చానని, బెంగాల్‌కు రావడం ఎంతో సంతోషాన్ని ఇస్తోందని రాహుల్ గాంధీ అన్నారు.





